నిరుద్యోగులు సంఘ విద్రోహులా?

- ఎన్నికల హామీలు తప్పడం వల్లే వారి పోరాటం
- ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో ఇంకోలా వ్యవహరిస్తరా..?
- ప్రభుత్వ అణచివేత చర్యలు, బెదిరింపులు సరికాదు
- ఆందోళనలో ఉన్న అభ్యర్థుల డిమాండ్లు నెరవేర్చాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ బహిరంగ లేఖ



పదోతరగతిలో 10 జీపీఏ సాధించిన 75 మంది విద్యార్థులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు ఐ ప్యాడ్‌లు అందజేశారు. ఆదివారం సిద్దిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన వీటిని అందజేశారు. ఒక్కో ఐ ప్యాడ్ పదివేల విలువ ఉంటుంది. వీటిని ఆయన తన సొంత ఖర్చులతో అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ట్వన్ ఫలితాల్లో సిద్దిపేట వరుసగా ఐదుసార్లు అగ్రస్థానంలో నిలవడం సంతోషంగా ఉన్నదని అన్నారు. -సిద్దిపేట

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా, వారిని సంఘ విద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం సరికాదని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆదివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అభ్యర్థుల సమస్యలు పరిష్కరించకుండా సీఎం మరింత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తగదని మండిపడ్డారు. ఉద్యోగార్థులతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమావేశం నిర్వహించి, ఎలాంటి ఉపశమనం కలిగించే మాటలు చెప్పలేదని పేర్కొన్నారు. హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మాట తప్పడం వల్లే నిరుద్యోగుల పోరాటం మొదలైందనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించాలని స్పష్టం చేశారు. 'మావి కొత్త డిమాండ్లు కావు, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినవే. రాహుల్ గాంధీ సహా ఇతర కాంగ్రెస్ నాయకులు గ్రంథాలయాలు, కోచింగ్ సెంటర్లకు వచ్చి ఇచ్చిన హామీలే' అని ఉద్యోగార్థులు నెత్తీనోరు కొట్టుకుంటున్నా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్సిటీ సహా అభ్యర్థులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీసు బలగాలను మోహరించి, ఇనుపకంచెలు వేసి, ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. ఆఖరికి జర్నలిస్టులనూ బెదిరించడం, అరెస్టు చేయడం, దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ అణచివేత చర్యలను ఖండించారు. అకారణంగా అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భేషజాలకు పోవద్దు

నిరుద్యోగుల పోరాటం వెనుక రాజకీయ శక్తులు ఉన్నాయంటూ సీఎం రేవంత్‌రెడ్డి నిందారోపణలు చేయడం ఆక్షేపణీయమని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సాకులు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేయడం వల్ల అభ్యర్థులు, నిరుద్యోగుల సమస్యకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు. నిరుద్యోగుల కోసం పోరాటం చేసిన మోతీలాల్, గ్రూప్ 1,2,3 పోస్టులకు దరఖాస్తు చేసిన విషయాన్ని ఆధారాలతో సహా అభ్యర్థులు బయట పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. హామీలు ఇచ్చినవారు పదవుల్లో ఉంటే నిరుద్యోగులు మాత్రం ఇంకా రోడ్లపైనే ఉన్నారని ఆయన విమర్శించారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరుద్యోగుల డిమాండ్లపై అవకాశం దొరికిన ప్రతీసారి దీక్షకు కూర్చున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆ విషయాన్ని మరిచిపోయినట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. ప్రతి అంశాన్ని రాజకీయం కోణంలో చూసే పద్ధతిని వీడాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగులు అశాంతితో ఉన్నారని, రాష్ట్రంలో పరిపాలన సవ్యంగా సాగటం లేదని పేర్కొన్నారు. అభ్యర్థులు, నిరుద్యోగుల జీవితాలను, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సానుకూల దృక్పథంతో చర్చలకు ఆహ్వానించాలని కోరారు.

నోట్‌దిస్ పాయింట్...సీఎం

- గ్రూప్ 2కు రెండు వేల ఉద్యోగాలు, గ్రూప్ 3కు మూడు వేల ఉద్యోగాలు అదనంగా కలుపుతామని ఇచ్చిన మాటను నిలుపుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.
- పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండటం వల్ల అభ్యర్థులు ఇబ్బందులకు గురై ఆందోళనకు గురవుతున్నారు. జూలై చివరి వరకు డీఎస్సీ పరీక్షలు ఉన్నాయి. ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్ 2 పరీక్ష ఉన్నది. కేవలం 7 రోజుల గ్యాప్ మాత్రమే ఉన్నదని,ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నామని ఆవేదన చెందుతున్న అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయదా?
- అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు మొదటి క్యాబినెట్‌లోనే నిర్ణయం తీసుకుంటామని మ్యానిఫెస్టోలో ప్రకటించారు. 25 వేల టీచర్ పోస్టుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని నిరుద్యోగులను నమ్మించారు. ఆచరణలో అందుకు భిన్నంగా ప్రవర్తించారు. కేసీఆర్ ఇచ్చిన 5వేల పోస్టులకు మరో 6వేలు కలిపి 11 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి మోసం చేశారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చెప్పిన దానికి కట్టుబడి మొత్తం ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసేలా మెగా డీఎస్సీ నిర్వహించాలి.
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగానే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. పత్రికల్లో మొదటి పేజీ ప్రకటనలు ఇచ్చారు. ఆర్నెళ్లు దాటినా ఆ దిశగా అడుగులు పడలేదు. వెంటనే 2 లక్షల ఉద్యోగాలు గుర్తించి జాబ్ క్యాలెండర్, నోటిఫికేషన్లు విడుదల చేయాలి.
- రాష్ట్రంలోని నిరుద్యోగులకు నెలకు రూ. 4000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు నిరుద్యోగులకు బకాయిపడిన మొత్తంతో పాటు, నిరుద్యోగ భృతిని క్రమం తప్పకుండా చెల్లించాలి.
- అధికారంలోకి వస్తే జీవో నంబర్ 46 రద్దు చేస్తామని నిరుద్యోగులను నమ్మించారు. అధికారంలోకి రాగానే జీవో 46 ప్రకారమే నియామక ప్రక్రియ పూర్తిచేశారు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి ఇది మరో నిదర్శనం. జీవో 46 ద్వారా ఏర్పడ్డ సమస్యలను పరిష్కరించి నిరుద్యోగులకు న్యాయం చేయాలి.

మాటమార్చడమే పనిగా పెట్టుకున్నారా?

కేసీఆర్ ప్రభుత్వం 503 ఉద్యోగాల భర్తీ కోసం గ్రూప్ 1 నోటిఫికేషన్ ఇచ్చిందని, వాటికి మరో 60 మాత్రమే చేర్చి 563 ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ వేశారని హరీశ్‌రావు వివరించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేశారని, ఇటీవల ఏపీలో నిర్వహించిన గ్రూప్ 2 నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టుగా కాకుండా అభ్యర్థుల కోరిక మేరకు 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కి ఎంపిక చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గ్రూప్ 1 పరీక్ష అనేది యూపీఎస్సీ మాదిరిగా ప్రతి సంవత్సరం ఉండదని, రాష్ట్ర స్థాయి సివిల్స్ పరీక్ష కావడం వల్ల ఆశావహుల సంఖ్య పెరిగిందన్నారు. 1:100 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తే ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమీ లేదని ఆయన వివరించారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాంగ్రెస్ శాసన సభాపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో గ్రూప్ 1 మెయిన్స్‌కు 1 :100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని అసెంబ్లీ వేదికగా డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉంటే ఒకమాట అధికారంలో ఉంటే వేరొకమాటగా ప్రవర్తించడం ఎందుకని ప్రశ్నించారు.

నల్లగొండలోని గడియారం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

గ్రూప్స్ వాయిదా వేయాలి

- పోస్టుల సంఖ్య పెంచాలి
- నల్లగొండలో నిరుద్యోగుల ధర్నా

రామగిరి, జూలై 14 : గ్రూప్- 2, 3 పరీక్షలను వాయిదా వేయడంతో పాటు పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు ధర్నాకు దిగారు. ఆదివారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని గడియారం సెంటర్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ.. గ్రూప్-2, 3 పరీక్షలకు ఒకే సిలబస్ ఉన్నందున రెండు పరీక్షల నిర్వహణ మధ్య కనీసం రెండు నెలల గడువు ఉండాలని సూచించారు. అప్పుడే అభ్యర్థులు చదువుకోవడానికి సమయం ఉంటుందని తెలిపారు. ఎన్నికల ముందు గ్రూప్-2, 3కి రెండు వేల చొప్పున పోస్టులు పెంచి నోటిఫికేషన్ వేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి రాగానే మాట మార్చుతున్నదని మండిపడ్డారు.

'పరీక్షలను వాయిదా వేయాలి'

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): గ్రూప్-2, 3 పరీక్షలను నెలపాటు వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ ఎల్ మూర్తి, కార్యదర్శి తాళ్ల నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

డీఎస్సీని వాయిదా వేయించండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి అభ్యర్థుల వినతి

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ) : డీఎస్సీని వాయిదా వేయించాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డిని ఆదివారం అభ్యర్థులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా 40కి పైగా పుస్తకాలను కిషన్‌రెడ్డికి చూపించి.. వీటిని 25 రోజుల్లో ఎలా చదవగలమని ఆయన ముందు కన్నీటిపర్యంతం చెందారు. టెట్ తర్వాత 25 రోజుల సమయమే ఇచ్చారని, ప్రిపరేషన్‌కు ఈ సమయం సరిపోదని తెలిపారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. స్పందించిన కిషన్‌రెడ్డి.. ప్రభుత్వం, అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

డీఎస్సీ హాల్‌టికెట్‌లో గందరగోళం

అమ్మాయి హాల్‌టికెట్‌పై అబ్బాయి ఫొటో.. సిగ్నేచర్

రామగిరి, జూలై 14: రేయింబవళ్లు డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థుల భవిష్యత్తు ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా కారణంగా ప్రశ్నార్థకంగా మారింది. నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన రుద్రారపు భవ్య డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ గణితం పోస్టుకు దరఖాస్తు చేసుకున్నది. ఆదివారం హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోగా.. ఆమె ఫొటో, సంతకానికి బదులు వేరొక అబ్బాయి ఫొటో, అతడి సిగ్నేచర్ వచ్చింది. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని భవ్య ప్రాధేయపడుతున్నది. దీనిపై డీఈవో భిక్షపతిని నమస్తే వివరణ కోరగా.. హాల్‌టికెట్‌లో సమస్యలు ఉంటే రాష్ట్ర విద్యాశాఖకు పంపి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

నిరుద్యోగులకు నరకం చూపిస్తున్న సర్కార్

బీఆర్ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): డీఎస్సీని వాయిదా వేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగులపై విచక్షణా రహితంగా దాడి చేయడం అప్రజాస్వామికం అని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు దుయ్యబట్టారు. ఉద్యోగాలు పెంచుమని అడిగితే సాంకేతిక కారణాలు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తున్నదని ప్రకటనలో ఆరోపించారు. హామీలను నిలబెట్టుకోవడం కాంగ్రెస్ సర్కారుకు చేతగాక నిరుద్యోగులపై దాడికి పాల్పడి రాక్షస ఆనందం పొందుతున్నదని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు స్వర్గం చూపుతామని ఆశలు కల్పించిన కాంగ్రెస్ ఇప్పుడు నరకం చూపిస్తున్నదని వాపోయారు. ఇందిరమ్మ రాజ్యమంటే రాష్ట్రంలో ఎమర్జెన్సీని తేవటమా? అని ప్రశ్నించారు.

పరీక్షలు వాయిదా పడితే చిక్కులు

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ) : కొందరు విద్యార్థులు పోటీ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతున్నారని, వాయిదా వేస్తే న్యాయ, సాంకేతికపరమైన చిక్కులు తలెత్తుతాయని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. అంతేకాకుండా తోటి నిరుద్యోగుకు తీరని నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. నిరుద్యోగుల ప్రయోజనం కోసమే షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ప్రతిఏటా నోటిఫికేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నారు.

ఏపీ అప్పులు రూ.14లక్షల కోట్లు

హైదరాబాద్, జూలై 14(నమస్తే తెలంగాణ): జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, ప్రస్తుతం రాష్ట్ర అప్పులు రూ. 14 లక్షల కోట్లకు చేరుకున్నాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేశ్ తెలిపారు. పన్నులు, ఇతర మార్గాల ద్వారా రాష్ట్రానికి రోజుకు రూ. 483 కోట్ల ఆదాయం సమకూరుతుండగా, ఖర్చు రూ. 655 కోట్లుగా ఉందని చెప్పారు. జనచైతన్యవేదిక ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి-కార్యాచరణ' అనే అంశంపై గుంటూరులో శనివారం నిర్వహించిన చర్చావేదికలో రమేశ్ మాట్లాడారు. రాష్ట్రానికి రోజుకు రూ. 172కోట్ల లోటు ఏర్పడుతుండగా, అప్పులపై రూ. 78 కోట్లు చెల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, రామచంద్రరాజు పాల్గొన్నారు.

ఆరు నెలల చిన్నారిపై తాత లైంగికదాడి

హైదరాబాద్, జూలై 14(నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా రామభద్రాపురం మండలంలో ఆరు నెలల చిన్నారిపై వరుసకు తాత అయిన వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన ఘటన వెలుగుచూసింది. బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నారిని తల్లి ఊయలలో వేసి బయటకు వెళ్లగా, సమీపంలోని నార్లవలసలో ఉండే తాత వరుసయ్యే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పాప గట్టిగా ఏడ్వడంతో చిన్నారి అక్క చేరుకొని తల్లికి సమాచారం అందించింది. తల్లితో పాటు గ్రామస్థులు నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అతడు పరారయ్యాడు. చిన్నారిని వైద్యం కోసం విజయనగరం దవాఖానకు తరలించారు. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి గాలిస్తున్నారు. చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

మంత్రులను కలిసి బాధలు చెప్పకోండి

- నిరుద్యోగులతో చర్చలకు సిద్ధంగా ఉన్నాం
- గౌడన్నల కృషివల్లే అధికారంలోకి కాంగ్రెస్
- మహేశ్వరంలో న్యూయార్క్‌ను తలదన్నే సిటీ నిర్మిస్తాం:ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- 'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీ



గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం కిట్లను పంపిణీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రంగారెడ్డి, జూలై 14(నమస్తే తెలంగాణ): నిరుద్యోగులతో చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పరీక్షలను వాయిదా వేయాలని కొందరు, వద్దని మరికొందరు అంటున్నారని పేర్కొన్నారు. పరీక్షల వాయిదా కోసం రోడ్డెక్కే బదులు మంత్రులను కలిసి వారి బాధలు చెప్పుకోవాలని సూచించారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆదివారం 'కాటమయ్య రక్షణ కవచం' కిట్ల పంపిణీ పథకాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా వేదికపై నుంచి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి గౌడన్నల కృషి ఉన్నదని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న రూ.7.9 కోట్ల ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదలకు ఆదేశాలు జారీచేశారు. వేదిక ఆవరణలో సీఎం ఈత మొక్కలు నాటారు. గీత కార్మికులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్, మంత్రులకు గీత కార్మికులు మోకు, కల్లు కుండలను బహూకరించారు.

సేఫ్టీ కిట్లను స్వయంగా పరీక్షించిన సీఎం

లష్కర్‌గూడ వేదికగా బీసీ కార్పొరేషన్ ద్వారా 10వేల మందికి సేఫ్టీకిట్లను సీఎం తన చేతుల మీదుగా కొందరికి పంపిణీ చేశారు. అంతకుముందు స్పీకర్, మంత్రులతో కలిసి కిట్ల పని తీరును రేవంత్ స్వయంగా పరిశీలించారు. అంతకుముందు వాటి పనితీరును బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం సీఎంకు వివరించారు. హైదరాబాద్ ఐఐటీ విద్యార్థుల బృందం ఆధునిక టెక్నాలజీతో ఈ సేఫ్టీకిట్లను తయారుచేసినట్టు తెలిపారు. ఎవరెస్టును అధిరోహించిన వారి సూచనలతో వీటికి రూపకల్పన చేసినట్టు వివరించారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి ఐదెకరాలు ఇవ్వాలని, వనాలకు వెళ్లేందుకు మోపెడ్లు ఇవ్వాలని ఈ సందర్భంగా గీత కార్మికులు సీఎంను కోరారు. దీనికి రేవంత్ సానుకూలంగా స్పందించారు. రియల్ ఎస్టేట్ పెరగడం వల తాటి వనాలు తగ్గుతున్నట్టు చెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న రోడ్ల పక్కన, వెంచర్ల ఏర్పాటు సందర్భంగా తాటి, ఈత చెట్లను నాటాలనే నిబంధన విధిస్తామని పేర్కొన్నారు. కుల వృత్తులపై ఆధారపడిన వారంతా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తీర్చిదిద్దాలని సూచించారు.

రంగారెడ్డి జిల్లాకు మహర్దశ

రంగారెడ్డి జిల్లాకు మహర్దశ పట్టబోతున్నదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ చుట్టూ మణిహారంలా ఏర్పాటవుతున్న రీజినల్ రింగ్‌రోడ్డుతోపాటు భవిష్యత్తులో రేడియల్ రోడ్లను అభివృద్ధి చేసుకోబోతున్నామని, పెద్ద ఎత్తున ఫార్మా, ఐటీ పరిశ్రమలను ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. న్యూయార్క్‌తో పోటీపడేలా మహేశ్వరంలో కొత్త నగరాన్ని నిర్మించబోతున్నట్టు తెలిపారు. హయత్‌నగర్‌కు త్వరలోనే మెట్రో రైలు రాబోతున్నదని తెలిపారు. ఊటీ కంటే అద్భుతమైన రాచకొండ ప్రాంతంలో ఫీల్మ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేయబోతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, ఎగ్గే మల్లేశం, ఏపీఎస్‌రెడ్డి, దయానంద్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్‌గౌడ్ ఉన్నారు.

గౌడన్నలకు అధునాతన మోకులు

బీఆర్ఎస్ హయాంలోనే రూపకల్పన

హైదరాబాద్, జూలై14 (నమస్తే తెలంగాణ): తాటిచెట్టుపై నుంచి పడి ప్రతి సంవత్సరం ఎంతోమంది కల్లుగీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో వాటి నివారణకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సేఫ్టీ మోకులు రూపొందించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా బీసీ సంక్షేమశాఖకు బాధ్యతలు అప్పగించి దాదాపు రూ. 8 కోట్లు కేటాయించింది. బీసీ సంక్షేమశాఖ ఆ బాధ్యతను ఓ ఏజెన్సీకి అప్పగించింది. ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఆ ఏజెన్సీ సేఫ్టీ మోకులను రూపొందించింది. అప్పుడే వాటిని పంపిణీ చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాట్లు చేయగా ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయింది. ఇప్పుడు 'కాటమయ్య రక్షణ కిట్లు' పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేస్తున్నవి అవే. రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల మందికి అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో సేఫ్టీమోకు రూ. 9 వేలపైనే ఉంటుందని అధికారులు తెలిపారు.

డీఎస్సీ వాయిదా వేయబోం

- నోటిఫికేషన్ ప్రకారమే పరీక్ష నిర్వహిస్తాం
- త్వరితగతిన ఉద్యోగాలు ఇవ్వడమే మా ఆలోచన
- త్వరలో 5-6 వేల పోస్టులతో మరో నోటిఫికేషన్
- తేల్చిచెప్పిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 14(నమస్తే తెలంగాణ): డీఎస్సీని వాయిదా వేయాలంటూ విద్యార్థులు విజ్ఞప్తులు, ధర్నాలు చేస్తున్నారని, అయితే పరీక్ష వాయిదా వేసేదే లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. విద్యార్థులు పరీక్షలు రాయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఈ నెల 18 నుంచి నిర్వహించే పరీక్షలకు హాజరై, సెలక్ట్ కావాలని సూచించారు. ఇదే చివరి డీఎస్సీ కాదని, ఇందులో సెలక్ట్ కాకపోతే మరో డీఎస్సీ వస్తుందని అన్నారు. ఈ మేరకు డీఎస్సీ వాయిదా వేయాలంటూ అభ్యర్థులు చేస్తున్న ఆందోళనపై స్పందించిన ఆయన.. ఆదివారం గాంధీభవన్‌లో మాట్లాడారు. నోటిఫికేషన్ ప్రకారమే ముందుకు వెళ్లాలని నిర్ణయించామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 16 వేల టీచర్ పోస్టుల ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం 5 వేల టీచర్ పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌కు మరో 6వేల పోస్టులను జోడించి తమ ప్రభుత్వం మొత్తం 11 వేల పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేసిందని వివరించారు. మిగిలిన 5-6 వేల పోస్టులతో కొద్ది నెలల్లోనే మరో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే నిరుద్యోగులు సమస్యపై దృష్టి పెట్టామని, ఇందులో భాగంగానే 3 నెలల్లోనే 30 వేల మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. చెప్పినట్లుగానే సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి పూర్తిస్థాయిలో ఉద్యోగాల క్యాలెండర్‌ను ప్రారంభించినట్టు వివరించారు. ఇప్పటికే 13,321 పోస్టుల భర్తీకి సర్వీస్ కమిషన్ చర్యలు చేపట్టిందని అన్నారు. గత ప్రభుత్వం పరీక్షల వాయిదాతో అభ్యర్థులు ఇబ్బంది పడ్డారని, ఇప్పుడు ఆ పరిస్థితి రాకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

'కల్యాణ లక్ష్మి' వసూళ్ల'పై సీఎం ఆరా

- 'నమస్తే తెలంగాణ' కథనానికి ముఖ్యమంత్రి స్పందన
- ప్రభుత్వ విప్‌ను హైదరాబాద్‌కు పిలిపించుకున్న సీఎం?

సిరిసిల్ల రూరల్, జూలై 14: రాజన్న సిరిసిల్ల జిల్లాలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కోసం కాంగ్రెస్ నేతలు లబ్ధిదారుల నుంచి పైసలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీసినట్టు తెలిసింది. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం 'కల్యాణలక్ష్మికి పైసా వసూల్' శీర్షికన ప్రచురితమైన వార్తకు సీఎం స్పందించారని సమాచారం. సీఎంవో నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఫోన్ చేసి హైదరాబాద్‌కు రావాలని సూచించగా.. ఆయన పైసా వసూల్ విషయాన్ని ముఖ్యమంత్రికి వివరించినట్టు తెలిసింది. ఈ విషయంపై స్పెషల్ బ్రాంచి, ఇంటెలిజెన్స్ విభాగ అధికారులు కూడా వివరాలు సేకరించి రిపోర్ట్ చేయడం గమనార్హం. సదరు కాంగ్రెస్ నేతపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

మోనార్క్ వైఖరి వల్లే..

- దుందుడుకుతనంతోనే సమస్య
- ఆరు నెలల్లోనే ఇన్ని ఆందోళనలా?
- కాంగ్రెస్ పార్టీ పరువు పోతున్నది
- సీఎం రేవంత్‌రెడ్డిపై సీనియర్ల కుతకుత
- అసలు కాంగ్రెస్ నేతల మండిపాటు

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): 'ఊరంతా ఒకదారి... ఉలిపిరికట్టదో దారి' అన్న చందంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని అసలు కాంగ్రెస్ (ఏసీ) నాయకులు వాపోతున్నారు. రాష్ట్రంలో పదేండ్ల తర్వాత ప్